




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 283

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శుక్రవారం 27 మార్చి 2026


## అమరావతే శాశ్వత రాజధాని...

### ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం



**అమరావతి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలే లక్ష్యంగా సుదీర్ఘంగా చర్చించి అనేక అంశాలను ఆమోదించారు. అమరావతిని శాశ్వత రాజధానిగా సుస్థిరం చేసేలా అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టడం, న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తూ 96 కొత్త కోర్టులు, 1730 ఉద్యోగాలను సృష్టించడం, వడ్డెర సామాజిక వర్గానికి క్వారీల్లో రిజర్వేషన్లు, ఆస్తిపన్ను వడ్డీ మాఫీ వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**అమరావతికే శాశ్వత రాజధాని హోదా!..** అమరావతి రాజధాని విషయంలో భవిష్యత్తులో ఎలాంటి మార్పులకు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సెక్షన్ 5ను సవరించాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక తీర్మానం చేయడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ సవరణ ద్వారా సెక్షన్ 5(2)లో "ఎట్ అమరావతి" అనే పదాన్ని, అలాగే అమరావతి అంటే ఏపీసీఆర్‌డీఏ చట్టం కింద నోటిఫై చేసిన ప్రాంతం అని స్పష్టంగా చేర్చాలని ప్రతిపాదించారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో సృష్టించిన గందరగోళం పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాజకీయ కక్ష సాధింపులతో రాజధానిని మార్చే దుశ్చర్యలకు పాల్పడకుండా, అమరావతిని శాశ్వత రాజధానిగా, ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పార్థసారథి వివరించారు.

**న్యాయవ్యవస్థ బలోపేతం దిశగా కీలక అడుగు..** రాష్ట్రంలో పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో న్యాయవ్యవస్థను బలోపేతం చేసేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. హైకోర్టు ప్రతిపాదన మేరకు రాష్ట్రవ్యాప్తంగా 96 కొత్త కోర్టులను (అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్, సివిల్ జడ్జ కోర్టులు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కోర్టుల నిర్వహణకు అవసరమైన 1,730 కొత్త పోస్టుల సృష్టికి కూడా ఆమోదం తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతి 10 లక్షల జనాభాకు 50 మంది న్యాయమూర్తులు ఉండాలనే నిబంధన, ఐదేళ్లకు మించి కేసులు పెండింగ్‌లో ఉండకూడదనే ఆదేశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019లో ఒక్కో జడ్జిపై 963 కేసుల భారం ఉండగా, 2025 నాటికి అది 1,474 కేసులకు పెరిగిన విషయాన్ని ప్రభుత్వం ప్రస్తావించింది. ఈ 1,730 పోస్టులను త్వరలో విడుదల చేసే జాబ్ క్యాలెండర్‌లో చేర్చే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

**వడ్డెరలకు చేయూత.. బీసీ వర్గాలకు ప్రోత్సాహం..** బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం, వడ్డెర సామాజిక వర్గానికి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు చారిత్రక నిర్ణయం తీసుకుంది. వడ్డెర సంఘాలకు క్వారీ లీజులను ప్రాధాన్యత ప్రాతిపదికన కేటాయించడంతో పాటు, ప్రీమియం,

- 4లో

## ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రమాదానికి గురైన పూర్తిగా కాలిపోయిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు
- 29 మంది సురక్షితం..14 మృతి పలువురికి గాయాలు
- ప్రమాద ఘటనపై దర్యాప్తు వేగవంతం










**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లా రాయవరం సమీపంలో చోటుచేసుకున్న ఘటనపై మార్కాపురం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జగిత్యాల నుండి కలిగిరి వెళ్ళు హరికృష్ణ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు AR20D0487 లో 43 మంది ప్రయాణికులు, డ్రైవర్లు ఇద్దరూ మొత్తం 45 మార్కాపురం,రాయవరం వద్ద కు

- 2లో






## బాలకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు..!



**ఢిల్లీ,కలంకౌంటర్ :** ప్రముఖ నటుడు నందమూరి బాలకృష్ణకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. ఢిల్లీ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేతులమీదుగా బాలకృష్ణ ఈ అవార్డును స్వీకరించారు. వెటరన్ నటి షర్మిలా ఠాగూర్, దివంగత నటుడు ధర్మేంద్రను సైతం లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో గౌరవించారు.

## రాష్ట్రంలో 96 కోర్టుల ఏర్పాటు వాటి నిర్వహణ కోసం 1730 పోస్టులకు గ్రీన్ సిగ్నల్

- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రవ్యాప్తంగా 2026-27 లో 96 క్రొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం న్యాయశాఖకు సంబంధించిన అంశాలకు సంబంధించి ఆమోదం లభించిన వివరాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. పెండింగ్ కేసుల తగ్గింపు కోసం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కొత్త కోర్టుల ఏర్పాటు కోసం హైకోర్టు రిజిస్టార్( పరిపాలన విభాగం ) ప్రతిపాదించడం జరిగిందని, ఈ ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న కోర్టులలో వివిధ స్థాయిలలో, విధి నిర్వహణ నిమిత్తం 1730 పోస్టులను సృష్టించేందుకు కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. కొత్తగా మరియు అదనంగా ఏర్పాటు కానున్న కోర్టులలో డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ స్థాయి కోర్టులు 12, సీనియర్ సివిల్ జడ్జి స్థాయి కోర్టులు 25, జూనియర్ సివిల్ జడ్జి స్థాయి కోర్టులు 59 ఏర్పాటు కానున్నట్లు న్యాయ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం

### - ఐస్ క్రీమ్, మజ్జిగ పంపిణీ



**తిరుపతి,కలంకౌంటర్ :** అఖిల భారత క్షత్రియ మహాసభ - 1897 ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలోని శ్రీనివాస థియేటర్ వద్ద వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ రవి రాజు గురువారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రవిరాజు మాట్లాడుతూ వేసవి తాకిడికి ప్రజలు అధికంగా మంచినీరు తీసుకొని ఉపశమనం పొందాలన్నారు. వడదెబ్బ తగలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే మజ్జిగ మంచినీరు అధికంగా తీసుకోవాలన్నారు. అఖిల భారత క్షత్రియ మహాసభ ఏ పి మాజీ ఉపాధ్యక్షులు భాను ప్రసాదరాజు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్ రాజు కోనేటి రవిరాజు, యూత్ అధ్యక్షులు బాలసుబ్రమణ్యం రాజు, రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన రాష్ట్ర అధికార ప్రతినిధి గుండ్రాజు సుకుమార్ రాజు మాట్లాడుతూ మండే ఎండల్లో ప్రజలు ఆరోగ్య సూత్రాల పాటించి ఆకుకూరలు భుజించి మాంసాహారాన్ని తెజించి మంచినీరు మజ్జిగ ఐస్ క్రీమ్ లాంటి చల్లని పదార్థాలు అధికంగా తీసుకోవాలన్నారు. చెన్నై రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు చామర్తి శోభా రాజు మనవరాలు స్వాతి రాజు జన్మదిన సందర్భంగా చలివేంద్రం వద్ద ఐస్ క్రీమ్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కోశాధికారి ప్రసాద్ రాజు, రామ్మోహన్ వర్మ, కృష్ణంరాజు,హేమచంద్ర వర్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి శ్రీ రాముని ఆశీస్సులు ఉండాలి -మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** శ్రీ రామ నవమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ధర్మ స్వరూపుడైన శ్రీరాముడు సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠలకు ఆదర్శప్రాయుడు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ సమాజంలో శాంతి, సౌహార్ద్రాలను నెలకొల్పడం మనందరి బాధ్యతగా భావించాలి. ఆ రాముని ఆశీస్సులతో మన రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నాను. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో, యువ నాయకుడు నారా లోకేష్ కృషితో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాలలో అభివృద్ధి సాధి స్తుందని నాకు నమ్మకం ఉంది. ఈ పవిత్ర పర్వదినం ప్రతి ఇంటిలో ఆనం దం, శాంతి, ఐశ్వర్యం నింపాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

# బస్సు ప్రమాద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఘటన స్థలాన్ని పరిశీలించిన మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యే నారాయణరెడ్డి, డీజిపి హరీష్ కుమార్ గుప్తా








**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం సమీపంలో జరిగిన ఘోర బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆయన వెంటా జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ పి. రాజబాబు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఉన్నారు. ఘటనపై వెంటనే స్పందించిన అధికారులు గోల్డెన్ అవర్‌లోనే ప్రమాద స్థలానికి చేరుకుని పలువురిని రక్షించినట్లు మంత్రి తెలిపారు. ఈ ప్రమాదంలో మొత్తం 13 మంది మృతి చెందినట్లు, మరో 28 మందిని ఆసుపత్రుల్లో చేర్చినట్లు మంత్రి వెల్లడించారు. బస్సులో మొత్తం 41 మంది ప్రయాణిస్తున్నట్లు సమాచారం అందిందని, సీరియస్‌గా గాయపడిన కొంతమందిని మెరుగైన చికిత్స కోసం ఒంగోలుకు తరలించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరిస్తుందని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా రాబోయే రోజుల్లో భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేస్తామని మంత్రి తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను నిపుణుల కమిటీ ద్వారా త్వరలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.

# రాష్ట్రంలో వంట గ్యాస్, పెట్రోలు, డీజిల్ కొరత లేదు

- నెల రోజుల్లో లక్ష పీఎన్జీ కనెక్షన్లు లక్ష్యం
- 24 గంటల్లో పీఎన్జీ కనెక్షన్ లకు అనుమతులు ఇస్తాం.
- అపార్ట్మెంట్ లు, వాణిజ్య వర్గాలు పీఎన్జీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- పర్యావరణ హితం,ధర తక్కువ కాబట్టి పీఎన్జీ సదుపాయంపై అవగాహన పెంచుకోవాలి.
- దీపం పథకం లబ్ధిదారులు పీఎన్జీ కి మారే విధంగా అవకాశం కల్పిస్తున్నాం.
- సోషల్ మీడియా లో మాత్రమే గ్యాస్, పెట్రోల్ కొరత అంటూ అబద్ధాలు ప్రచారం
- ప్రజలు పుకార్లను నమ్మవద్దు.. ఆందోళన చెందవద్దు.. రాష్ట్రంలో సరిపడా నిల్వలు ఉన్నాయి.
- రాష్ట్రంలోని అన్ని అంగన్ వాడీలకు ఇండక్షన్ స్టవ్ లు అందిస్తున్నాం.
- వంట గ్యాస్, పెట్రోల్, డిజిల్ బ్లాక్ మార్కెట్ కు పాల్పడితే కఠిన చర్యలు.
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మాత్యులు నాదెండ్ల మనోహర్.



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజుల్లో లక్షకు పైగా పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని రాష్ట్ర పౌర సరఫరాలు,ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించిన ముఖ్య నిర్ణయమైన పీఎన్జీ కనెక్షన్లు పెంపుపై ఏపీ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని విజయవాడ,గుంటూరు, నెల్లూరు,కాకినాడ,విశాఖపట్నం, తిరుపతి తదితర నగర ప్రాంతాల్లోని ఎల్పీజీ సిలిండర్లు వినియోగిస్తున్న వినియోగ దారులను ఆయా నగరాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జీ) వైపు మళ్లించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.పిఎన్‌జీ ద్వారా గ్యాస్ నిరంతర సరఫరా అందుబాటులో ఉండడంతో పాటు అపార్ట్‌మెంట్లు, పారిశ్రామిక యూనిట్లు ఈ సదుపాయాన్ని వినియోగిస్తే కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభిస్తాయని వివరించారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి,విజయవాడ కనకదుర్గ దేవస్థానం,శ్రీ కాళహస్తి, అన్నవరం,సింహాచలం దేవాలయాల్లో కూడా పీఎన్జీ కనెక్షన్లు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.అంతేకాకుండా అన్న క్యాంటిన్లకు కూడా పీఎన్జీ కనెక్షన్లు అందించాలన్న నిర్ణయం తీసుకున్నామన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఎన్జీ కనెక్షన్లు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు.అందులో భాగంగానే పీఎన్జీ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకున్న అపార్ట్ మెంట్లు,హోటళ్లు తదితర కమర్షియల్ యూనిట్లు, పారిశ్రామిక యూనిట్లకు 24 గంటల్లో కనెక్షన్లు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.అవసరమైతే ఆటోమేటిక్ అనుమతి వ్యవస్థను అమలు చేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం జీఎస్టీ 5 శాతం నుండి 25 శాతంకు పెంచడం వల్లే పీఎన్జీ వినియోగంపై వినియోగదారులు ఆసక్తి చూపలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.దీపం సబ్సిడీ పథకాన్ని పీఎన్జీ వినియోగదారులకు కూడా వర్తింపజేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దీపం పథకం కింద నాలుగు నెలలకు ఒకసారి ఉచిత సిలిండర్ అందిస్తుండగా, పిఎన్‌జీ వినియోగదారులకు నిబంధనల మేరకు రెండు నెలలకు ఒకసారి సబ్సిడీ ప్రయోజనం అందే విధంగా మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. మూడు సిలిండర్లకు సంబంధించిన రూ.2400 డిబిటి మొత్తాన్ని పీఎన్జీ వినియోగదారులకు బదిలీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 94 లక్షల దీపం పథకం లబ్ధిదారులు ఉన్నారన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందుతున్న వదంతులను ఖండిస్తూ,రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 2 లక్షల 70 వేల గ్యాస్ సిలిండర్లు సరఫరా జరుగుతున్నాయని చెప్పారు. అయితే గ్యాస్ కొరత అంటూ సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం కావడంతో వినియోగదారులు అవసరం లేకపోయినా గ్యాస్ సిలిండర్ లు బుక్ చేయడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయన్నారు.కాని నేడు పరిస్థితి అదుపులోకి వచ్చిందన్నారు.సాధారణంగా రోజుకు 2.70 లక్షల నుండి 2.80 లక్షల సిలిండర్లు డెలివరీ అవుతున్నాయని, ఒక్కో రోజు 3.30లక్షల సిలిండర్లు కూడా డెలివరీ చేశామని వివరించారు. గ్యాస్,ఆయిల్ బ్లాక్ మార్కెట్ కు పాల్పడినా,ధరలు పెంచి అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్ పాల్గొన్నారు.

# రైతన్నల సంక్షేమమే లక్ష్యం.. మరింత అంకితభావంతో పనిచేస్తా - మంత్రి అచ్చెన్నాయుడు

- ప్రజాభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘ సేవ... అచ్చెన్నపై సీఎం ప్రశంసల వర్షం
- సచివాలయంలో సీఎం చంద్రబాబు , మంత్రి లోకేష్ సమక్షంలో మంత్రి అచ్చెన్న పుట్టినరోజు వేడుకలు
- సీఎం చంద్రబాబు ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను పెంచాయన్న మంత్రి అచ్చెన్న






**అమరావతి,కలంకౌంటర్ :** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో సీఎం ఛాంబర్‌లో మంత్రుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చేసారికి ఉదయం తెల్లవారుజామున సుమారు 5.45 గంటల సమయంలో పొదిలి వైపు నుండి కంకర్ టిప్పర్ నెంబర్ ఏపీ 39ఖజ 5265 ను ఢీకొని దగ్ధమైంది. ఈ ఘటనలో 14 మృతి చెందగా 29 మంది సురక్షితంగా బయటపడ్డారు. పలువురు గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన తర్వాత బస్సుకు మంటలు వ్యాపించాయి. బస్సు అద్దాలను పగులగొట్టడంతో ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న జిల్లా ఎస్పీ గారు వెంటనే సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజిన్లు మరియు అంబులెన్సులను పంపించి, తాను కూడా అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలిస్తూ రెస్క్యూ టీంతో కలిసి సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను వెంటనే ఆసుపత్రికి తరలించామని తెలిపారు. అనంతరం బస్సు కిటికీలో నుంచి దూకిన కొందరు ప్రయాణికులకు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించి క్షతగాత్రులను పరామర్శించి క్షేమ సమాచారాలను తెలుసుకున్నారు. అక్కడి ప్రయాణికులతో మాట్లాడి కేసు నమోదు చేయడంతో పాటు దర్యాప్తు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాణికులకు సురక్షితంగా వారి ప్రదేశాలకు వెళ్ళుటకు తగిన ఏర్పాట్లు చేశారు.

## అమ్మ ప్రేమ అంటే ఇదే!

### బస్సు ప్రమాదంలో కొడుకును రక్షించి తల్లి సజీవదహనం

**మార్కాపురం,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లా రాయవరం వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు టిప్పర్ ఢీకొని అకస్మాత్తుగా బస్సు లో మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది.కనిగిరి (మం)మందాడివారిపల్లికి చెందిన ఉప్పు రమాదేవి తన కొడుకు మనోహర్‌తో కలిసి స్వగ్రామానికి వెళ్తుండగా ఘటన జరిగింది.ప్రమాదాన్ని గమనించిన రమాదేవి,తన ప్రాణాలను పణంగా పెట్టి కొడుకును బయటకు తోసి అతని ప్రాణాలు కాపాడింది. మంటలు వేగంగా వ్యాపించడంతో ఆమె బస్సులోనే చిక్కుకుని,కొడుకు కళ్లెదుటే సజీవదహనమైంది.

# వాట్సాప్ కాల్‌లో అరెస్ట్ (డిజిటల్ అరెస్ట్) అంటే వెంటనే అప్రమత్తం అవ్వండి - జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

● సైబరు మోసానికి గురైనా లేదా వాట్సాప్ కాల్‌లో అరెస్ట్ (డిజిటల్ అరెస్ట్) అంటే వెంటనే 1930 లేదా డయల్ 100/112 కు సమాచారం అందించాలని లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎస్పీ

● సైబరు మోసానికి గురైనట్లయితే మొదటి గంటలో (గోల్డెన్ హవర్) 1930కు ఫిర్యాదు చేయాలన్న జిల్లా ఎస్పీ



**విజయనగరం,కలంకౌంటర్ :** సైబరు మోసాలు, వాట్సాప్ కాల్‌లో అరెస్ట్ చేయడం (డిజిటల్ అరెస్ట్) వంటి మోసాల పట్ల అవగాహన లోపం కారణంగా ఇటీవలి కాలంలో ప్రజలు మోసాలకు గురవుతున్నారని, ఇటువంటి సైబరు మోసగాళ్ళు, వారు చెప్పే మాయమాటలు పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - ఇటీవలి కాలంలో వాట్సాప్ కాల్‌లో అరెస్ట్ చేయడం (డిజిటల్ అరెస్ట్) పేరుతో సైబరు మోసాలు పెరుగుతున్నాయన్నారు. కొంతమంది సైబరు మోసగాళ్లు తాము పోలీసు అధికారులు, సిబిఐ, ఈడి వంటి సంస్థల అధికారులు అని చెప్పుకొని వీడియో కాల్స్, ఫోన్ కాల్స్ ద్వారా ప్రజలను భయపెట్టి డబ్బులు దోచుకుంటున్నారని అన్నారు. ఈ విధంగా సైబరు మోసగాళ్లు ప్రజలను ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని మీ ఆధార్, బ్యాంక్ ఖాతాలు లేదా మొబైల్ నంబర్ క్రైమ్‌లో ఉపయోగించబడిందని, మీ పిల్లల పై డ్రగ్స్ కేసు నమో దయ్యిందని చెబుతూ, "మీరు అరెస్ట్‌లో ఉన్నారు" అని నమ్మిస్తారని, తద్వారా, మీపై కేసు నమోదు చేయకుండా ఉండటానికి డబ్బులు పంపాలని ఒత్తిడి చేస్తారని జిల్లా ఎస్పీ తెలిపారు. వాస్తవానికి వాట్సాప్ కాల్‌లో అరెస్ట్ చేయడం (డిజిటల్ అరెస్ట్) అనే విధానం భారతదేశంలో లేదని, పోలీస్ లేదా ఇతర దర్యాప్తు సంస్థలు వీడియో కాల్ ద్వారా ఎవరినీ అరెస్ట్ చేయవని, ఇది పూర్తిగా సైబరు మోసగాళ్లు పని అని జిల్లా ఎస్పీ తెలిపారు. ఇటువంటి నేరగాళ్ళు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, ఎవరైనా ఈ తరహాలో ఫోనులు చేస్తే సమాచారాన్ని డయల్ 100/112 లేదా 1930కు అందించాలని లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ పిలుపునిచ్చారు. అదే విధంగా సైబరు నేరాలకు పాల్పడే మోసగాళ్ళు ప్రజల వ్యక్తిగత సమాచారం, బ్యాంకింగు వివరాలు, ఓ.టి.పి.లు, సివివి, పాస్వర్డులు లాంటి అంశాలను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున, వాటిని ఎట్టి పరిస్తితుల్లోని ఇతరులతో పంచుకోవద్దని, గోప్యత పాటించాలన్నారు. ఈ మధ్యకాలంలో ట్రాఫిక్ చలానాల పేరుతో, గ్యాస్ బుకింగ్ పెరుతో లింకులు మరియు ఎపికే ఫైల్స్ పంపి ప్రజలనుండి సైబర్ నేరగాళ్ళు దోచుకుంటున్నారన్నారు. ప్రజల ఆసక్తిని గమనించి, సైబరు నేరగాళ్ళు వారి మొబైలు ఫోన్లకు కొన్ని లింకులు, ఎపికే ఫైల్స్, క్యూఆర్ కోడ్స్, సందేశాలను, ఈ-మెయిల్ పంపి, వారి బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారన్నారు. అదే విధంగా ఆన్-లైన్ లోన్ యాపుల వైపు వెళ్ళవద్దని ప్రజలను కోరారు. ఈ దాడులను నియంత్రించేందుకు ప్రజలు సైబరు మోసాలు పట్ల అవగాహన పెంచుకోవాలని, అనుమానస్పద లింకులు, ఎపికే ఫైల్స్ పై క్లిక్ చేయకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ కోరారు.

# పరిశోధనల అమలుతో రైతులకు మేలు

● జి శివనారాయణ, విస్తరణ సంచాలకులు, ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం

● బాపట్ల లో ఏరువాక కేంద్ర ఆధ్వర్యం లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం



**బాపట్ల,కలంకౌంటర్ :** బాపట్లజిల్లా రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటల నష్టాలను తగ్గించడం లక్ష్యంగా ఏరువాక కేంద్రం, బాపట్ల ఆధ్వర్యంలో గురువారం నాడు బాపట్లలోని పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్లో జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం సంచాలకులు డాక్టర్ జి. శివ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ముందు మరియు కోత తర్వాత సరైన రైతు యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను రైతులు వినియోగించడం ద్వారా వ్యవసాయ రంగంలో దిగుబడులలో వ్యత్యాసం తగ్గించడం, ఖర్చులు తగ్గి ఆదాయాన్ని పెంచడం, విత్తనోత్పత్తి సాధ్యమవుతాయని అన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం, గుంటూరు పరిశోధన సహా సంచాలకులు డా. ఎన్.వి.వి.ఎస్. దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రైతులు నూతన పరిశోధనలను తెలుసుకుని వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. ఈ సమావేశాన్నీ నిర్వహించిన ఏరువాక కేంద్రం జిల్లా సమన్వయకర్త డాక్టర్ కె. అచ్యుతరాజు మాట్లాడుతూ రైతులకు పంట యాజమాన్యం పై అవగాహన కల్పించేందుకు ఇలాంటి సమావేశాలు నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఏం విజయ నిర్మల, బాపట్ల జిల్లా ఏపి ఎం ఐ పి ప్రాజెక్ట్ డైరెక్టర్ బీవీ రమణ, లీడ్ బ్యాంక్ మేనేజర్, పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతు బోడవుల లక్ష్మీనారాయణ, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ సంఘాల ప్రతినిధులు, రైతులు, పాల్గొని రైతు యాజమాన్య పద్ధతులు, విలువ వృద్ధి వంటి అంశాలపై అవగాహన పొందారు.

# శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, కలంకౌంటర్ :** శ్రీ సీతారాముల దివ్య కల్యాణాన్ని స్మరించుకుంటూ జరుపుకునే శ్రీరామనవమి పండుగ సందర్భంగా కందుకూరు నియోజకవర్గ ప్రజలందరికీ కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ధర్మం, న్యాయం, అంకితభావంతో పనిచేసే నాయకత్వం... ఇవన్నీ శ్రీరాముని జీవితం మనకు నేర్పిన గొప్ప సందేశాలు.ప్రతి ఒక్కరి జీవితంలో ధర్మం నిలవాలి. ప్రతి ఇంట్లో ఆనందం వెలగాలి. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలి - ఇదే మన సంకల్పం కావాలి. శ్రీరాముని ఆదర్శాలు మనకు మార్గదర్శకం కావాలి. సీతా సమేత కోదండరాముడి కరుణా కటాక్షాలు మీ అందరిపై ఉండాలని, పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకుంటూ కందుకూరు నియోజకవర్గం ప్రజలకు ఇంటూరి నాగేశ్వరరావు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు.

# బంటుమిల్లిలో ఎమ్మెల్యే కాగిత ప్రజా దర్బార్



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలం బంటుమిల్లి పట్టణంలో జానకి రామపురం లో టిడిపి కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ లో పలు సమస్యలపై పలువురు అర్జీలు సమర్పించారు. ప్రజలు సమర్పించిన అర్జీలకు సంబంధించి గ్రామాల్లో తాగునీటి సమస్య రోడ్లు భూ ఆక్రమణలు వీధిలైట్లు విద్యుత్ సమస్యలు తదితర వాటిపై వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ స్వయంగా పరిశీలించి అధికారులకు పరిష్కారానికి తగిన సూచనలు చేశారు .ప్రజా దర్బార్ లో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ ప్రజా దర్బార్లో 10 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూనపరెడ్డి వీరబాబు డిసి చైర్మన్ బొర్రా కాశీ విశ్వేశ్వరరావు జిల్లా తెలుగుదేశం నాయకులు కూనసాని చిన్న, మైనార్టీ సెల్ నాయకులు ఎండి నజీర్, జొన్నలగడ్డ కొండలరావు ఆకునూరి రత్నకుమార్ భూపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్



**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ప్రజలకు ప్రభుత్వ విప్, కుప్పం అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామనవమి పండగ ప్రతి ఒక్కళ్ళు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఆకాంక్షించారు. శ్రీరామనవమి సందర్భంగా ప్రజలందరికీ సీతారాముల అనుగ్రహం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. సీతారాములను గ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన కోరుకున్నారు. ప్రతి ఒక్క కుటుంబం శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ కోరుకున్నారు.

# ఉచిత కంటి పరీక్షలు



**తిరువూరు,కలంకౌంటర్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ తిరువూరు ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ క్రియేటివ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు సుమారు 650 మంది విద్యార్థులకు డాక్టర్ వై జగన్మోహన్ రావు మెమోరియల్ చైల్డ్ ఐ కేర్, కొండపల్లి వారు సాంకేతిక సహకారం తో ఉచితంగా కంటి పరీక్షలు చేయడం జరిగింది. వారిలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రమైన కంటి సమస్యలు గుర్తించడమైనది. వారికి ప్రత్యేకంగా చికిత్స అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. 11 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు లయన్స్ క్లబ్ ద్వారా అందజేయగలము. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ పివి రావు, సెక్రెటరీ లయన్ చలమాల శంకర్ రావు, జీఎస్టీ కోఆర్డినేటర్ లయన్ అడ్వకేట్ కంచర్ల ముత్య ప్రసాద్ పాల్గొన్నారు.

# మహాసభ అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్య!

● కీలక పదవులపై ఉత్కంఠ ● ప్రధాన కార్యదర్శి రేసులో పల్లపోతు,మాటూరి

● సమర్థులకు ఇచ్చే యోచనలో అగ్ర నాయకత్వం



ఇల్లూరి లక్ష్మయ్య, అధ్యక్షులు



పల్లపోతు వెంకటేశ్వర్లు



పల్లపోతు వెంకటేశ్వర్లు

**విజయవాడ,కలంకౌంటర్ :** ఎంతో చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ నూతన పాలకవర్గం కూర్పు కోసం అగ్రనాయకత్వం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.ఇప్పటికే అధ్యక్షుడిగా ఇల్లూరి లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కీలక పదవులైన ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులు ఎంపిక చేసి ప్రకటన చేయాల్సి ఉంది.మహాసభ ఔన్నత్యాన్ని పెంచడం, మహాసభ నూతన భవన నిర్మాణం పూర్తి చేయడం,ఆర్యవైశ్యులకు మరింత మేలు చేసేలా సేవలందించే వారిని గుర్తించి కీలక పదవులు ప్రధాన కార్యదర్శి,కోశాధికారి,యువజన విభాగం అధ్యక్షుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు,సేవాదళ్ చైర్మన్ బాధ్యతలు అప్పగించే కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.అందరితో మమేకం అవుతూ,సంఘం బలోపేతం కోసం కృషి చేయడం ,సమర్థవంతంగా సమావేశాలు నిర్వహణ,మేము మహా సేవకులం అని డబ్బాలు కొట్టుకునే వారిని కాకుండా నిజాయితీ గా సేవ చేసే వారికి ఛాన్స్ ఇచ్చే విషయం అగ్ర నాయకత్వం పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు.

**ప్రధాన కార్యదర్శి రేసులో పల్లపోతు, మాటూరి..** కీలక బాధ్యతలు నిర్వహించాల్సిన ప్రధాన కార్యదర్శి పదవికి రేసులో ఒంగోలు నుంచి పల్లపోతు వెంకటేశ్వర్లు ,గుడివాడ నుంచి మాటూరి రంగనాథ్ ఉన్నారు.వీరిలో అగ్రనాయకత్వం ఎవరిని ఎంపిక చేస్తుందనే ఉత్కంఠ రాష్ట్ర వ్యాప్తంగా నెలకొంది. ప్రతి జిల్లాలో ఇదే చర్చ సాగుతోంది.రాష్ట్ర వ్యాప్తంగా మహాసభ బలోపేతం లక్ష్యంగా ,అన్ని సమీకరణలు చూసుకుని ప్రధాన కార్యదర్శి పదవికి సమర్థుడిని ఎంపిక చేయాలన్న నిర్ణయం లో అగ్రనాయకత్వం ఉంది.

**పల్లపోతుకు ఛాన్స్ ఇవ్వాలని వినతులు..** ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా ఒంగోలుకు చెందిన పల్లపోతు వెంకటేశ్వర్లు అన్ని విధాల అర్హత కలిగిన వ్యక్తి అని రాష్ట్రవ్యాప్తంగా సోషల్ మీడియాలో వినతులు వెల్లువెత్తాయి.. ఆర్యవైశ్య సంఘాల్లో గత 30 సంవత్సరాలకు పైగా ఆర్యవైశ్యులకు అనేక సేవలందిస్తున్నారు. 1995లో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారిగా, 2014లో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శిగా, అనేకమార్లు ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహాదారులుగా ప్రకాశం జిల్లా ఆర్యవైశ్యులకు సేవలందించారు . ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా నాగబాబు ఉన్న సమయంలో ఎక్స్ అఫీషియో మెంబర్ గా, పెనుగొండ సుబ్బరాయుడు, చిన్ని రామ సత్యనారాయణ సమయంలో ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాష్ట్ర ఆర్యవైశ్యులకు సేవలందించారు. ఇక తెలుగుదేశం పార్టీలో 14 సంవత్సరాలు ఒంగోలు పట్టణ తెలుగుదేశం పార్టీ కోశాధికారిగా, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధిగా రెండు సంవత్సరాలు, ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యవర్గ సభ్యులుగా రెండు సంవత్సరాలు, ప్రకాశం జిల్లా కోశాధికారి రెండు సంవత్సరాలు తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఆర్యవైశ్యులకు సుదీర్ఘ సేవలు అందించారు. 2019లో తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నేటి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్ తో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యుల సమస్యలపై బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా నిలిచారు. అదేవిధంగా హైదరాబాద్ లో ఉన్న ఆర్యవైశ్య మహాసభ బిల్డింగ్ విషయంలోనూ, ఒంగోలు వైశ్య భవన్ బిల్డింగ్ విషయంలోనూ న్యాయపోరాటం చేశారు. ప్రకాశం జిల్లాలో ప్రతి ఆర్యవైశ్యునికి తన సొంత కుటుంబీకుడిలా ఉండి వారికి ఏ అవసరం వచ్చినా తన మిత్రులు, ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి తన వంతు సాయం అందించడంలో ముందుండేవాడు. జిల్లాలోనే కాదు రాష్ట్రంలో పల్లపోతు వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఆర్యవైశ్య నాయకులకు సుపరిచితుడు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులందరూ పల్లపోతు వెంకటేశ్వర్లుకు ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా ఇవ్వాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన మిత్రులు పల్నాడు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు సుబ్బు, కొనగళ్ళ సత్యం, బస్సు బాబు, వాసవి సేవా రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ శ్రీను ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, జలదంకి వెంకటకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి ముప్పల శ్రీనివాసులు, వాసవి సేవాదళ్ జిల్లా అధ్యక్షులు అమరా భాను ప్రకాష్, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు, కందుకూరు మండల ఆర్యవైశ్య సంఘం కన్వీనర్ మురారి శెట్టి సుధీర్ కుమార్, జరుగుమల్లి మండల అధ్యక్షులు కోటా కిషోర్ బాబు, మాజీ ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు కూరపాటి రమేష్,చీదేళ్ల వేణు, ఐ వి ఎఫ్ స్టేట్ యువజన సంఘం నాయకులు రవ్వా శ్రీనివాసులు, ఐవిఎఫ్ స్టేట్ ఈసీ మెంబర్ గుర్రం చిన్న అల్లూరయ్య (జి సి ఏ) ఇంకా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యులు ముక్తకంఠంతో పల్లపోతు వెంకటేశ్వర్లు కు ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

# కూటమి పాలనలో విద్యార్థుల బంగారు భవితకు నిలయాలుగా అంబేద్కర్ గురుకులాలు

● కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులాల్లో విద్య బోధన, మెరుగైన సౌకర్యాలు ● విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ ● మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ● అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేసిన మంత్రి డా.స్వామి



**అమరావతి,కలంకౌంటర్ :** డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష (BRAGCET 2026) ఫలితాలు గురువారం వెలగపూడి సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విడుదల చేశారు. 2026 - 27 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ఖాళీగా ఉన్న 15,020 సీట్లు, జూనియర్ ఇంటర్ లో 13,840 సీట్లకు 01.03.2026 ప్రవేశ పరీక్ష నిర్వహించారు. వీటితో పాటు 6,7,8,9,10 తరగతుల్లో ఖాళీలకు 08.03.2026 వ తేదీన పరీక్ష నిర్వహించారు. 5 తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాల కోసం మొత్తం 1,15,313 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,01,799 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. గురువారం విడుదల చేసిన ఫలితాల్లో వీరిలో 88.27 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల విడుదల చేసిన అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ..అడ్మిషన్లకు పెద్ద మొత్తంలో దరఖాస్తులు రావడం అంబేద్కర్ గురుకులాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకున్న నమ్మకం, విశ్వాసానికి నిదర్శనం. కూటమి పాలనలో పేద విద్యార్థుల బంగారు భవితకు నిలయాలుగా అంబేద్కర్ గురుకులాలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అంబేద్కర్ గురుకులాల్లో నాణ్యమైన విద్య బోధనా, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. రాష్ట్రంలో ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లు 3 నుంచి 10 కి పెంచాం. ఐఐటీ, నీట్ లో తృటిలో అర్హత కోల్పోయిన వారికి లాంగ్ టర్మ్ కోచింగ్ ఇస్తున్నాం. గురుకుల్లాలో ఇంటర్ విద్యార్థులకు ఎంసెట్, నీట్ తో పాటు దేశంలో, రాష్ట్రంలో ప్రసిద్ధ యూనివర్సిటీలు, విద్యాసంస్థలకు దరఖాస్తులు చేయించి వాటిలో సీట్లు సాధించడమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నాం. గురుకులాల్లో విద్యార్థుల విద్య, సంక్షేమం, ఆరోగ్యం, భద్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. సీట్లు సాధించిన విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆకాంక్షించారు.

# ప్రయాణం చేసే సమయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలి



**చందోలు(బాపట్లజిల్లా),కలంకౌంటర్ :** ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా చందోలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ చందోలు నుండి పొన్నూరు వెళ్ళు రహదారిలో ప్రజలకు ముఖ్య సూచనలు చేశారు. యువత ఏ విధంగానైన డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, వాటివలన శారీరక మానసిక ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. అలానే గ్రామస్తులు కోడి పందాలు, పేకాటలు ఇతర జూదాలకు సంబంధించిన క్రీడలు ఆడరాదని తెలియపరచనారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని సూచించారు. దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదని హెచ్చరించారు.తన ప్రసంగంలో ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ కోరారు.

# ఉగాది పంచాంగం ఆవిష్కరించిన వై వి బి రాజేంద్రప్రసాద్





**ఉయ్యూరు,కలంకౌంటర్ :** కలం కౌంటర్ దినపత్రిక ఉగాది తెలుగు పంచాంగం బుక్స్ ఆవిష్కరించిన పంచాయతీ రాజ్ ఛాంబర్ జాతీయ అధ్యక్షుడు,మాజీ ఎం ఎల్ సి వై వి బి రాజేంద్రప్రసాద్.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠకులకు ఉపయోగపడేలా సమగ్ర వివరాలతో మార్కెట్ లోకి తెలుగు పంచాంగం విడుదల చేసిన పత్రిక యాజమాన్యాన్ని అభినందించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పాఠకులకు నిత్యం విలువైన సమాచారాన్ని అందిస్తూ అందరి మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించడం ప్రశంసనీయం అన్నారు.ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకుడు వెంట్రప్రగడ వీరాంజనేయులు, టీడీపీ రాష్ట్ర నాయకుడు,సగర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంపని వీర శ్రీనివాసరావు ,టౌన్ టిడిపి నాయకుడు చలపాటి శ్రీనులు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల గళాన్ని వినిపిస్తున్న కలం కౌంటర్ దినపత్రిక అధినేత రవికుమార్ కు అభినందనలు తెలిపారు. పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

# ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

● దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమానహక్కు ● ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన ● సమగ్ర ప్రణాళికతో ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం ● పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ ● 3వ రోజ కుప్పం పర్యటనలో నారా భువనేశ్వరి







**కుప్పం,కలంకౌంటర్ :** పరిశ్రమల రాకతో కుప్పానికి మహర్దశ పట్టబోతోందని, అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందించారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా 3వ రోజు భువనేశ్వరి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా శాంతిపురం మండలం శివ పురంలోని నివాసంలో స్థానిక నేతలతో నారా భువనేశ్వరి బ్రేక్ ఫాస్ట్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం శాంతిపురంలో అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబసభ్యులను నారా భువనేశ్వరి పరామర్శించారు. రామకుప్పం,మణేంద్రంలో ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. రామకుప్పంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకుప్పం మండలం బల్ల గ్రామంలో మహిళలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. అనంతరం రామకుప్పంలో టీడీపీ కార్యకర్త ముజాహిద్ ఇంటికి వెళ్లి కుటుంసభ్యులతో మాట్లాడారు. సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి రామకుప్పం మండలం గోవిందపల్లి గ్రామానికి వెళ్లిన నారా భువనేశ్వరి ఇటీవల మరణించిన టీడీపీ కార్యకర్త ఆనంద్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు.

**ఎన్టీఆర్ హయాంలో మహిళాభ్యున్నతికి బాటలు..** కుప్పం నియోజకవర్గం రామకుప్పంలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో కిలోమీటరు మేర వారితో పాటే భువనేశ్వరి కలిసి నడిచారు. విగ్రహావిష్కరణ అనంతరం భువనేశ్వరి మాట్లాడుతూ సమాజమే దేవాలయం - ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం స్థాపించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టేందుకు రూ. 2 కే కిలో బియ్యం పథకం ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్. మగవారితో సమానంగా మహిళలకు ఆస్తిలో హక్కు కల్పించారు. రిజర్వేషన్లు కల్పించారు. ప్రత్యేకంగా మహిళల కోసం పద్మావతి మహిళా యూనివర్సిటీ స్థాపించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. డ్వాక్రా స్థాపించి మహిళల ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేశారు. పేదలకు పట్టెడన్నం పెట్టాలనే ఉద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రవేశపెట్టారని నారా భువనేశ్వరి అన్నారు. అనంతరం రామకుప్పంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి భువనేశ్వరి పూలమాల వేసి నివాళు లర్పించారు.

**కుప్పం అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక..** రామకుప్పం మండలం బల్ల గ్రామంలో పర్యటించిన నారా భువనేశ్వరి మహిళలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ ...ఎన్టీఆర్ స్ఫూర్తితో చంద్రబాబు గారు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర, స్వర్ణ కుప్పం లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడం చంద్రబాబు గారి సమర్థ నాయకత్వానికి నిదర్శనం. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ , అనకాపల్లి జిల్లాలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్ ఏర్పాటవుతున్నాయి. చంద్రబాబు గారిని 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. కుప్పానికి పరిశ్రమల రాకతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఆర్థిక సాయం చేస్తున్నారు. దీపం పథకం ద్వారా మహిళలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నారు. పేదలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు సంజీవని ప్రాజెక్టు తెచ్చారు. ఇళ్లపై సోలార్ ప్యానెల్స్, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. హంద్రినీవా ద్వారా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చారు. డ్వాక్రా స్థాపించి మహిళలకు ఆర్థిక భద్రత కల్పించారు. కుప్పంలో ఎలీప్ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. చంద్రబాబు గారికి ప్రజలే ముఖ్యమని, సాయం కోసం వచ్చిన వారు ఏ పార్టీ అని ఆలోచించరని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటారని నారా భువనేశ్వరి తెలిపారు.

# నిరుపేద బ్రాహ్మణులను ఆదుకోవాలి

● బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్



**మచిలీపట్నం,కలంకౌంటర్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం లో రెండవ రోజు గురువారం జరిగిన క్లస్టర్ శిక్షణ శిబిరానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, పల్లా శ్రీనివాసరావు ను బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ మర్యాదపూర్వకంగా కలుసుకుని బ్రాహ్మణుల సమస్యలు తదితర విషయాలపై మాట్లాడి, మచిలీపట్నం బ్రాహ్మణ సేవా సంఘం వారిచే రూపొందించిన నూతన పంచాంగం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా పి. వి. ఫణి కుమార్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వం లో చనిపోయి-న నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చుల కింద పదివేలు ఇచ్చామని, మరల ఇప్పుడు నిరుపేద బ్రాహ్మణులకు మట్టి ఖర్చుల కింద పదివేల రూపాయలు చనిపోయిన నిరుపేద బ్రాహ్మణ కుటుంబానికి ఇప్పించవలసిందిగా కోరాము అన్నారు. అలాగే నిరుపేద బ్రాహ్మణులకు సబ్సిడీతో కూడిన రుణాలను అందజేసి నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు అండగా ఉండాలని కూడా తెలిపాము అన్నారు. అలాగే బ్రాహ్మణుల వివిధ సమస్యలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకు వెళ్లినట్లు పి. వి. ఫణి కుమార్ తెలిపారు. బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు అన్నారు. బ్రాహ్మణులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాసరావు తెలిపారు అన్నారు. తెలుగుదేశం పార్టీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి, తెలుగుదేశం పార్టీ పటిష్టత కోసం విశేష కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, పల్లా శ్రీనివాసరావు పి. వి. ఫణి కుమార్ కు సూచించారు అని తెలిపారు.

# అమరావతే శాశ్వత రాజధాని...

(మొదటిపేజీ తరువాయి)

సీనరేజ్ ఫీజులో 50% రాయితీ ఇవ్వడానికి రూపొందించిన మార్గదర్శకాలకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు క్వారీల్లో 15 శాతం వారికి రిజర్వ్ చేయనున్నారు. అనాదిగా మట్టి, రాతి పనులపై ఆధారపడి జీవిస్తున్న వారి వృత్తిని ప్రోత్సహించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, అవసరమైతే వారికి పరికరాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించేలా కూడా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారని మంత్రి పేర్కొన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులకు నిధులు.. కీలక అనుమతులు..** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పూర్తిపై ప్రభుత్వం దృష్టి సారించింది. హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ఫేజ్-1లో మిగిలిపోయిన పనులను పూర్తి చేయడానికి, పొంగనూరు బ్రాంచ్ కెనాల్ నిర్మాణంలో పెరిగిన అంచనా వ్యయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లాలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్ కింద 7 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ల నిర్వహణకు రూ.4.40 కోట్లు మంజూరు చేసింది. పోలవరం నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కోసం భూసేకరణలో భాగంగా భూమి ధరను ఎకరాకు రూ.4.20 లక్షలకు పెంచారు. దీని వల్ల రైతులకు ఎకరాకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పరిహారం అందనుంది.

# మార్కాపురం బస్సు ప్రమాద మృతులకు రాష్ట్ర కేబినెట్ సంతాపం

● మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,కలంకౌంటర్ :** మార్కాపురం జిల్లాలో బస్సు ప్రమాద ఘటనలో మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం చెల్లించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోన్న వారికి రూ.2 లక్షల చొప్పున సాయం అందించాలని సూచించారు. మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర మంత్రివర్గం గురువారం తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. బస్సు ప్రమాద ఘటనలో పలువురు మృతి చెందటం పట్ల సంతాపాన్ని తెలిపింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర మంత్రివర్గం సానుభూతిని తెలియచేసింది. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, బాధితులకు అందుతున్న వైద్యాన్ని పర్యవేక్షించాలని మంత్రులు, అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ప్రమాదాల నివారణతో పాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రవాణా, రహదారులు & భవనాల శాఖ, పోలీసు, వైద్యారోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రణాళికలు అమలు చేసి ఈ తరహా ఘటనలు జరగకుండా చూడాలని ఆదేశించారు. రాయవరం ప్రమాద ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని, దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.






Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com